క్లుప్తంగా

అన్నదానానికి విరాళాలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి మంగళవారం ఖమ్మం జిల్లా, వైరా పట్టణానికి చెందిన మేడ సుమంత్, సౌమ్య దంపతులు రూ.5,002, కట్టా హరీష్, నర్మద దంపతులు రూ.5,002 ఆలయ అధికారి బి.కృష్ణమోహన్ చేతుల మీదుగా అందజేశారు. ఖమ్మం జిల్లా, వైరా మండలం, పల్లిపాడుకు చెందిన ధనేకుల సుధీర్, సునీత దంపతులు రూ.10,116 విరాళం అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

విజేతకు ఘనసత్కారం



జగ్గయ్యపేట అర్బన్: తెలంగాణ రాష్ట్ర పారా బ్యాడ్మింటన్ సీఎం కప్ టోర్నమెంట్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన స్థానిక 9వ వార్డు చింతల తోపు ప్రాంతానికి చెందిన నందిగామ జీవన్‌ను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మంగళవారం అభినందించారు. పట్టణంలోని జెడ్పీ బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో ఉన్న కేవీకే ఇండోర్ స్టేడియంలో శాప్ కోచ్ కీసర గోపి వద్ద శిక్షణ పొందుతున్న జీవన్ ఈనెల 2వ తేదీన హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర పారాబ్యాడ్మింటన్ సీఎం కప్ టోర్నమెంట్‌లో పాల్గొని ప్రథమస్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్యను జీవన్ మర్యాదపూర్వకంగా కలవగా, జీవన్‌ను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నరసింహస్వామిని దర్శించుకుని సీఈ



వేదాద్రి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారిని దేవాదాయశాఖ చీఫ్ ఇంజినీర్(సీఈ) శేఖర్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన ఆలయ అభివృద్ధికి సంబంధించిన అభివృద్ధి పనుల మాస్టర్‌ప్లాన్‌పై ఈవోతో చర్చించారు. కార్యక్రమంలో ఈఈ రాజు, ఈవో సురేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పడవ తనిఖీ



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని కృష్ణానదిలో నిబంధనల మేరకు పడవ నడపాలని ఈవోపీఆర్డీ పద్మ సూచించారు. గ్రామంలోని కృష్ణానది వద్ద పడవ రాకపోకలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పడవ లైసెన్స్ ఉన్నా నిబంధనల మేరకు పడవ నడపాలని ఆదేశించారు. లైసెన్స్ లేకుండా పడవ నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రక్షణ చర్యలను పరిశీలించారు. ప్రయాణికుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలి



తిరుమలగిరి(జగ్గయ్యపేట): ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని ఆలయ ఏసీ వరప్రసాద్ కోరారు. గ్రామంలోని వెంకటేశ్వర స్వామివారి ఆలయ ఆవరణలో స్వామివారి నిత్య పూజల కోసం దాత అందించిన 360 గులాబీ మొక్కలను మంగళవారం ఆయన నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు మరింత సహకరించాలని కోరారు. ఆలయం వద్ద కూడా భక్తులకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భరద్వాజ్, దాత గడుపూడి వీరప్రసాద్, నాయకులు ముత్తవరపు వెంకటేష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కూటమి గ్రహణం



కంచికచర్లలో అసంపూర్తిగా మిగిలిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం పనులు



గండేపల్లిలో నిలిచిన జెడ్పీ పాఠశాల తరగతి గదుల పనులు

నిలిచిన అభివృద్ధి వెలుగులు

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభం
- కూటమి ప్రభుత్వం వచ్చాక సాగని పనులు
- ప్రజలకు తప్పని ఇక్కట్లు



కంచికచర్ల మండలం పేరకలపాడులో నిధుల కొరతతో నిలిచిపోయిన ఆర్‌బీకే భవనం పనులు



కంచికచర్లలో శ్లాబు దశలో నిలిచిన అంగన్‌వాడీ కేంద్రం పనులు

కంచికచర్ల: కంచికచర్ల మండలంలోని ఆయా అభివృద్ధి పనులకు కూటమి గ్రహణం పట్టింది. గత వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఆయా అభివృద్ధి పనులు ఎక్కడి కక్కడ నిలిచిపోవడమే ఇందుకు నిదర్శనం. ప్రజాప్రయోజనాల దృష్ట్యా కంచికచర్ల మండలంలో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులతో ఆయా అభివృద్ధి పనులు చేపట్టింది. శరవేగంగా సాగుతున్న ఆయా పనులు సార్వత్రిక ఎన్నికల కారణంగా ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఎన్నికల తర్వాత అధికారాన్ని చేపట్టిన సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆయా పనులను కొనసాగించకుండా ఎక్కడకక్కడ నిలిపివేసింది. దీంతో ఆయా పనుల లక్ష్యం నెరవేరకపోగా, ఇప్పటికే ఖర్చుచేసిన కోట్లాది రూపాయల నిధులు నిరుపయోగమయ్యాయని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

గతంలో మెజార్టీ పనులు పూర్తి..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఊరూరా గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, పాఠశాలల అదనపు తరగతి గదులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలను భారీస్థాయిలో చేపట్టింది. నందిగామ నియోజకవర్గంలోని కంచికచర్ల, నందిగామ, వీరులపాడు, చందర్లపాడు నాలుగు మండలాల్లో 65గ్రామ సచివాలయాలు, 65 రైతుభరోసా కేంద్రాలు..48 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్ల నిర్మాణ పనులను ప్రారంభించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 47 గ్రామ సచివాలయాలు, 27ఆర్‌బీకేలు, 23 వెల్‌నెస్ సెంటర్ల పనులను పూర్తిచేసింది. పనులు పూర్తయిన కార్యాలయాలు, భవనాల నుంచి అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన భవనాల పనులు వివిధ దశల్లో ఉండగా, కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయా పనులు ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

పనులు పూర్తి చేయాలని ప్రజల డిమాండ్.

కంచికచర్ల, చందర్లపాడు, వీరులపాడు గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ద్వారా రోగులకు పూర్తిస్థాయిలతో వైద్యసేవలు అందడం లేదు. 24 గంటలపాటు రోగులకు వైద్యసేవలు అందించేలా కొత్త భవనాల నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ శ్రీకారం చుట్టింది. ఎన్నికల తర్వాత అధికారాన్ని చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆయా పనులను పూర్తిచేయడంపై మాత్రం ఆసక్తిచూపడం లేదు. ఇకనైనా పాలకులు స్పందించి నియోజకవర్గంలో నిలిచిపోయిన ఆయా పనులను పూర్తిచేయించాలని ప్రజలు కోరుతున్నారు.

సచివాలయం లేక ఇక్కట్లు..



మా గ్రామంలో సచివాలయానికి సొంత భవనం లేకపోవటంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ భవనంలోనే సచివాలయాన్ని నిర్వహిస్తున్నాం. ఆగిపోయిన నిర్మాణాలను కొత్త ప్రభుత్వం ఎప్పుడు మొదలుపెడుతోందో తెలియడం లేదు. త్వరితగతిన నిధులు కేటాయించి నిర్మాణాలు పూర్తిచేయాలి.

– బొక్కా రవికుమార్ సర్పంచి, గండేపల్లి కంచికచర్ల మండలం

ఆర్‌బీకేను సొసైటీలో నడుపుతున్నాం..



రైతుభరోసా కేంద్రం(ఆర్‌బీకే) భవన నిర్మాణాలకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో కొంతమేర భవన నిర్మాణాలు పూర్తి చేశారు. ఈలోగా సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధులు కొరతతో నిర్మాణాలను నిలిపివేసింది. దీంతో రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

– కోదాటి రామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు వేములపల్లి

ఆదేశాలు రాగానే పనులు ప్రారంభిస్తాం...

నియోజకవర్గంలో 65 గ్రామ సచివాలయాలకు 47పూర్తయ్యాయి. 27ఆర్‌బీకేలు, 23వెల్‌నెస్ సెంటర్ల పనులు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఆగిపోయాయి. నిర్మాణాల కొనసాగించేందుకు ప్రభుత్వం నుంచి మాకు ఇంతవరకూ ఆదేశాలు రాలేదు. ఆదేశాలు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– శ్రీనివాసరావు, పీఆర్ డీఈఈ, నందిగామ

ప్రత్యామ్నాయ రోడ్డు వసతి కల్పించాలి



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ముత్తారెడ్డి, రైతులు

నందిగామ టౌన్: రైల్వేలైన్ కింద పోతున్న డొంక రోడ్డుకు ప్రత్యామ్నాయంగా రైతులకు రహదారి సౌకర్యం కల్పించాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి కోరారు. వీరులపాడు మండలంలోని పెద్దాపురం గ్రామంలోని వ్యవసాయ భూములకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ మంగళవారం ఆయన రైతులతో కలిసి స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముత్తారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఎర్రుపాలెం నుంచి గుంటూరు జిల్లా నంబూరు రైల్వేలైన్ కారణంగా పెద్దాపురం గ్రామంలోని వ్యవసాయ భూములకు వెళ్లే డొంకరోడ్డు కూడా పోతుండటంతో రైతులకు ఇబ్బందులు తప్పవన్నారు. ప్రత్యామ్నాయ రోడ్డు వసతి కల్పించాలని కోరారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ సూపరింటెండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని వివరించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్



తహసీల్దార్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వీరులపాడు: రైల్వేలైన్ కింద భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువకు నాలుగు రెట్లు నష్టపరిహారం అందించాలని సీపీఎం పార్టీ జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు కోట కళ్యాణ్ డిమాండ్ చేశారు. మండలంలోని అల్లూరు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైల్వేలైన్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు, వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ తహసీల్దార్ హుస్సేన్‌కు సీపీఎం, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ అమరావతి రైల్వేలైన్ ఏర్పాటుకు కంచికచర్ల, వీరులపాడు మండలాల పరిధిలో వందల ఎకరాల సాగు భూములు తీసుకునేందుకు ప్రభుత్వ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఈ భూములలో కొందరు రైతులు పలు రకాల పంటలను సాగు చేశారని, బోర్లు ఉన్నాయని వీటన్నింటికి కలిపి నష్టపరిహారం అందించాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో నాయకులు చాట్ల రవి, లాల్ అహ్మద్ గౌస్, గుంజి వీరయ్య, మండూరి శ్రీనివాసరావు, భూషణం, రాము, తదితరులు ఉన్నారు. ఆయా భూసమస్యల పరిష్కారం కోరుతూ 20 అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. సర్పంచ్ బందెల రాణి, ఎంపీటీసీ సభ్యురాలు మొండ్రు బాయమ్మ, ఎంపీడీవో అరుంధతీదేవి తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వే లోపాలను సరిదిద్దాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

నందిగామటౌన్: కులగణన జాబితాలో దొర్లిన తప్పులను సవరించాలని కోరుతూ పలువురు న్యాయవాదులు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ గతంలో నిర్వహించిన కుల గణన సర్వేలో కులం, మతం, విద్యార్హతలతోపాటు ఇళ్లు లేని వారికి కూడా ఇల్లు ఉన్నట్లు నమోదు చేశారన్నారు. కులగణన అధికారులు ఇంటింటికీ తిరిగి సర్వేచేసి సరైన నివేదికను ప్రభుత్వానికి అందించాలని కోరారు. కులగణనలో జరిగిన తప్పుల సవరణకు అవకాశం కల్పించటంతోపాటు గడువు తేదీ పొడిగించాలని వారు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో న్యాయవాదులు ఎక్కిరాల హనుమంతరావు, దగ్గుపాటి కమలాకరరావు, చెరుకుపల్లి రామారావు, పంది ప్రకాశరావు, బొబ్బిళ్లపాటి భాస్కరరావు, జెట్టి కృష్ణ, తుళ్లూరి విశ్వేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కాంట్రాక్టర్ల బకాయి బిల్లులు చెల్లించండి

రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన బీఏఐ

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బకాయిపడిన బిల్లులను సాధ్యమైనంత త్వరగా చెల్లించి కాంట్రాక్టర్లను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నాయకులు విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని ఒక హోటల్లో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) సమావేశం మంగళవారం జరిగింది. ఆ సంఘ రాష్ట్ర చైర్మన్ అత్తలూరి నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఇటీవల రుణాల ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన యువ కాంట్రాక్టర్ జనార్దన్‌రెడ్డి మృతికి సంతాపం తెలిపి, నివాళులర్పించారు. అనంతరం అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లకు ప్రభుత్వం నుంచి సుమారు రూ.2 వేల కోట్ల మేరకు బిల్లులు రావాల్సి ఉందన్నారు. కాంట్రాక్టర్ జనార్దన్ రెడ్డి ఆత్మహత్య వంటి ఘటనలు పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. చేసిన పనులకు ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు కావడంలో ఆలస్యం అవుతున్నందున పనులు చేసేటప్పుడు చేసిన అప్పులు, వాటిపై వడ్డీ భారం పెరిగి కాంట్రాక్టర్లు తీవ్రమైన మానసిక ఆందోళనకు గురవుతున్నారని నాయకులు వివరించారు. కాంట్రాక్టర్ల కష్టాలను గుర్తించి ప్రభుత్వం కాంట్రాక్టర్లు చేసిన పనులకు ఇవ్వాల్సిన బిల్లులను మంజూరు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డి.పంకజ్ రెడ్డి, వల్లభనేని వెంకటేశ్వరరావు, బి.రాఘవరావు, ఎ.నాగమల్లేశ్వరరావు, సిహెచ్.రామకోటయ్య, పి.రాజబాబు, పలువురు చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌ను 9గంటలపాటు ఇవ్వాలి

తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: రైతులకు రోజుకు తొమ్మిది గంటలపాటు ఉచిత విద్యుత్‌ను ఇవ్వాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గంలో చిన్న, సన్నకారు రైతులందరూ బోరు బావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారన్నారు. ఈ బోరు బావుల మీద ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులందరికి ఎన్నికలకు ముందు నాణ్యమైన విద్యుత్‌ను ఉచితంగా రోజుకు 9 గంటల పాటు ఇస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఊసే లేదని ఆరోపించారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇచ్చినమాటకు కట్టుబడి వ్యవసాయానికి రోజుకు 9గంటలపాటు నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందించారని తెలిపారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. 9గంటలపాటు ఇవ్వాల్సిన ఉచిత విద్యుత్‌ను 6గంటలు, 7 గంటలు కుదించి ఇస్తున్నారని, ఇందులో లైన్ క్లియరెన్స్(ఎస్‌సీ) అని చెప్పి విద్యుత్‌ను ఆపివేస్తున్నారన్నారని విమర్శించారు. దీంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోవడంతోపాటు ఇచ్చిన హామీ మేరకు గతంలో మాదిరిగా యథావిధిగా వ్యవసాయానికి రోజుకు 9 గంటల పాటు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఎస్టీ సెల్ నాయకుడు లాహోరి బద్దూనాయక్, పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకుడు కన్నమాల శామ్యూల్, యూత్ నాయకుడు గొట్టిపాల సురేష్ పాల్గొన్నారు.

నేడు అధికారులతో సమన్వయ సమావేశం

పెనుగంచిప్రోలు: ఫిబ్రవరి నెలలో నిర్వహించే శ్రీతిరుపతమ్మవారి పెద్ద తిరునాళ్ల మహోత్సవాలు, వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం 4 గంటలకు ఆలయ ప్రాంగణంలో అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు ఈవో భూపతిరాజు వెంకట సత్య నాగకిషోర్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించే ఈసమావేశానికి సంబంధిత అధికారులంతా తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

కంచికచర్ల : స్థానిక డాక్టర్ ప్రభాకరరావు ఆసుపత్రిలో కంచికచర్ల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీ గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ ప్రతినిధి డాక్టర్ పుల్లగూర ప్రభాకరరావు మంగళవారం తెలిపారు. విజయవాడకు చెందిన ఆంధ్ర ఆసుపత్రి వైద్యులు ఈ శిబిరంలో పాల్గొని గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీలకు సంబంధించిన స్కానింగ్ మరియు టెస్టులు, కంటి, పళ్ల పరీక్షలు చేస్తారన్నారు. అవకాశాన్ని కంచికచర్ల పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

150 మందికి వైద్యపరీక్షలు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ధరణికోట వారి పెన్షనర్స్ భవన్‌లో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగుల కుటుంబసభ్యులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్మైలీ హాస్పిటల్ వైద్య బృందం పాల్గొని 150మందికి వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య నిపుణులు ఎండీ రమణారావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు ధరణికోట రమణ, అధ్యక్ష, కార్యదర్శులు దారా వినోద్‌బాబు, చింతల తిరుపతయ్య పాల్గొన్నారు.

ఈనెల 13 నుంచి కబడ్డీ పోటీలు

వీరులపాడు:సంక్రాంతి పండుగ సందర్భంగా కొణతాలపల్లి ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నండ్రు నారాయణ, నండ్రు ముక్కంటి మంగళవారం తెలిపారు. ఈ పోటీలు ఈనెల 13 నుంచి 15వ తేదీవరకు గ్రామంలో ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు ఈ నెల 12న సాయంత్రం ఆరుగంటల్లోగా ఎంట్రీలు నమోదు చేయించుకోవాలన్నారు. విజేతలకు ప్రథమమ బహుమతిగా రూ. 15,116, ద్వితీయ రూ. 10,116, తృతీయ రూ. 7,116లతో పాటు స్పెషల్ ప్రైజ్‌గా రూ. 2,116లు అందిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9542895987, 8096886096 సంప్రదించాలని వారు సూచించారు.

రేపు మండల పరిషత్ సమావేశం

వీరులపాడు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అరుంధతీదేవి తెలిపారు. మండలంలోని జుజ్జూరులోని మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ కోటేరు లక్ష్మి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

ఆకట్టుకున్న అష్టావధానం

విజయవాడ కల్చరల్: మొగల్రాజపురంలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ మేడసాని మోహన్ నిర్వహించిన అష్టావధానం ఆద్యంతం ఆకట్టుకుంది. కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులు పృచ్ఛకులుగా పాల్గొనడం విశేషం. డాక్టర్ పాలపర్తి శ్యామలానందప్రసాద్ (నిషిద్ధాక్షరి),డాక్టర్ గుమ్మా సాంబశివరావు (సమస్యాపూరణం)... (నస్తాక్షరి), డాక్టర్ జె.వి.చలపతిరావు (దత్తపది), డాక్టర్ పీవీ కృష్ణారావు(సమస్యాపూరణం), డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ (వర్ణన), డాక్టర్ కప్పగంతు రామకృష్ణ(అప్రస్తుత ప్రసంగం), వలివేటి శివరామకృష్ణమూర్తి (కావ్యపురాణం), ధీరజ్, మోహన, ఎలిజిబత్ రాణి, భువనేష్ ఆశువు అంశాలను సమర్థంగా నిర్వహించారు. కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ ఎస్.శివకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన తన్నీరు



జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ ఉమ్మడి కృష్ణాజిల్లా రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని ఆపార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు మంగళవారం కలిశారు. తాడేపల్లిలోని వైవీ సుబ్బారెడ్డి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసినట్లు తన్నీరు తెలిపారు. కార్యక్రమంలో మాజీమంత్రి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం మాజీచైర్మన్ కర్నాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

రామిరెడ్డిపల్లి(నందిగామటౌన్): రెవెన్యూ సదస్సులను రైతులతు సద్వినియోగించుకుని రెవెన్యూపరమైన సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సురేష్‌బాబు సూచించారు. మండలంలోని రామిరెడ్డిపల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టాదారు పాస్‌పుస్తకం, సర్వే, అడంగల్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు రైతులు అర్జీలు అందజేశారని, ఆయా అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని వివరించారు. కార్యక్రమంలో సీఐ వైవిఎల్ నాయుడు, పలుశాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ అధికారులను కలిసిన మునేరు ప్రాజెక్టు చైర్మన్



పెనుగంచిప్రోలు: మునేరు ప్రాజెక్టు చైర్మన్ పొన్నం బాలాజీ మంగళవారం ఇరిగేషన్ ఈఈ గంగయ్య, సీఈ బి.బాబూరావులను విజయవాడలోని వారి కార్యాలయంలో కలిశారు. ఈసందర్భంగా వత్సవాయి మండలం పోలంపల్లి వద్ద మునేరు ప్రాజెక్టును పరిశీలించేందుకు రావాలని కోరగా, సంక్రాంతి తరువాత ప్రాజెక్టు సందర్శనకు వస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రాజెక్టు వద్ద సమస్యలను పరిష్కారించాలని అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు బాలాజీ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్పీ డీసీ మాజీ చైర్మన్ వేగినేటి గోపాలకృష్ణమూర్తి, నీటి సంఘాల సమాఖ్య చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీధర్మపురి లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ధనుర్మాస పూజలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు పరాంకుశం సీతారామాచార్యులు ఆధ్వర్యంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మద్యం సీసాలు పట్టివేత



కంచికచర్ల: అక్రమంగా మద్యం విక్రయించినా, తరలించినా అరెస్ట్ చేసి కేసు నమోదు చేస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సీఐ షేక్ అఫ్రపున్నీసా బేగం హెచ్చరించారు. మండలంలోని పరిటాలలో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న కె.సురేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మంగళవారం తెలిపారు. బెల్టు షాపులు నిర్వహించినా, మద్యాన్ని తరలించాని అరెస్ట్ చేసి కేసు నమోదు చేస్తామన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగినా అదుపులోకి తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ గాలీబ్‌సాహెబ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫర్నీచర్ వితరణ

ఇబ్రహీంపట్నం: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇబ్రహీంపట్నం బ్రాంచి అధికారులు స్థానిక పీహెచ్‌సీకి రూ.2 లక్షల విలువైన వివిధ రకాల ఫర్నీచర్‌ను మంగళవారం అందజేశారు. మూడు బెడ్స్, ఇంజక్షన్ ట్రాలీలు 6, స్టాండ్ బీపీ ఆపరేటర్స్ 2, బేబీ వార్మర్ ఒకటి, ఐరన్ 3 సీట్ బెంచీలు రెండు వైద్యశాలకు అందజేశారు